

ఇంటి భోజనం పిటిషన్.. ప్రభుత్వానికి నోటీసు

బెంగళూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్యకేసులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న నటుడు దర్శన్ ఇంటి భోజనం కోసం దాఖలు చేసుకున్న పిటిషన్‌పై హైకోర్టు ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. పరప్పన అగ్రహార జైలులో ఉన్న దర్శన్ దాఖలు చేసుకున్న పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఆర్ కృష్ణకుమార్ ఏకసభ్య ధర్మాసనం బుధవారం విచారించింది. దర్శన్ తరపున న్యాయవాది ఫణీంద్ర వాదనలు విన్న న్యాయమూర్తి, రాష్ట్ర ప్రభుత్వ అభ్యంతరాలకు అవకాశం ఇవ్వాల్సి ఉందని, ఆ మేరకు నోటీసులు జారీ చేయాలని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రసన్నకుమార్‌ను ఆదేశించారు.


చిచ్చురేపిన బెంగళూరు దక్షిణ

- కొత్త వివాదానికి తెరలేపిన డీకే శివకుమార్
- రామనగర జిల్లా పేరును మార్చాలని ప్రతిపాదన
- ప్రతిపక్షాల ఆగ్రహం
- మేం అధికారంలోకి వస్తే మారుస్తాం: కుమారస్వామి
- రాముడి పేరు ఉన్నందుకేనా.? ప్రతిపక్ష నేత అశోక్



సీఎం సిద్దరామయ్యకు వినతి పత్రం సమర్పిస్తున్న డీకే శివకుమార్ నేతృత్వంలోని బృందం

బెంగళూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): బ్రాండ్ బెంగళూరు కోసం ఎన్నో ప్రణాళికలు, సలహాలకు ప్రాధాన్యత ఇస్తూ వస్తున్న ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కొత్త ప్రతిపాదనకు తెరలేపారు. ఇటీవల చెన్నపట్టణలో వరుస పర్యటనల వేళ ప్రస్తావించినట్టుగానే రామనగర జిల్లా పేరు మార్చేందుకు సిద్ధమయ్యారు. బెంగళూరు గ్రామీణను కలుపుకొని 2007లో రామనగర జిల్లా ఏర్పాటైంది. రామనగరకు అనుబంధమైన హారోహళ్లి, కనకపుర, చెన్నపట్టణ, మాగడి, రామనగరను బెంగళూరు దక్షిణ జిల్లాగా మార్పు చేయాలని భావించారు. ఇందుకు అనుగుణంగానే రామనగర జిల్లా పరిధిలోని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు ప్రత్యేక వినతి పత్రం ఇచ్చారు. ఇది కాస్తా రాజకీయ వర్గాల్లో చిచ్చురేపింది. రాజధాని బెంగళూరుకు దక్షిణవైపు ఉండే ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్‌కు బూస్ట్ ఇవ్వనుంది. ఈ ఆలోచన డీకే శివకుమార్‌కు కొత్తగా వచ్చిందేమీ కాదు. ఏడాది కిందట శాసనసభ ఎన్నికల వేళ ఈ ప్రాంతంలో ఎవరూ భూములు అమ్ముకోరాదని, మీకు భవిష్యత్తు ఉంటుందని ప్రచారం చేశారు. ఇదే విషయమై డీసీఎం డీకే శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ బెంగళూరు నగరం అంతర్జాతీయస్థాయి గుర్తింపు రామనగర, మాగడి, కనకపుర, చెన్నపట్టణ, హారోహళ్లి తాలూకాలకు లభించాలని ఆ ప్రాంత ప్రజల ఆశయంగా ఉందన్నారు. అందుకు అనుగుణంగానే రామనగర పేరు మార్చి బెంగళూరు దక్షిణ జిల్లాగా నామకరణం చేయాలని ముఖ్యమంత్రికి ప్రతిపాదించామని అన్నారు. బెంగళూరు నగరానికి అనుబంధమైన దొడ్డబళ్లాపుర, దేవనహళ్లి, హొస్కోటె, కనకపుర, రామనగర, చెన్నపట్టణ, మాగడి ప్రాంతాల్లోని వారి మూలం బెంగళూరు జిల్లా అన్నారు. బెంగళూరు దక్షిణ జిల్లాగా మార్పు చేయడం ద్వారా భవిష్యత్తులో రామనగర, చెన్నపట్టణ, మాగడి ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. పరిశ్రమల స్థాపనకు పెట్టుబడిదారులు ముందుకొస్తారని అన్నారు. ముఖ్యంగా ఆస్తుల విలువ పెరుగుతుందన్నారు. బెంగళూరుకు ఓ వైపు ఆంధ్రప్రదేశ్, మరోవైపు తమిళనాడు సరిహద్దులుగా ఉన్నాయన్నారు. బెంగళూరు విస్తరణ కన్నడిగులకే లబ్ధి చేకూరాలంటే తుమకూరు, రామనగర, చెన్నపట్టణ ప్రాంతాల అభివృద్ధి ముఖ్యమన్నారు.



మేం అధికారంలోకి వస్తే మారుస్తాం - కేంద్రమంత్రి కుమారస్వామి

రామనగర జిల్లాను బెంగళూరు దక్షిణగా మార్చే ప్రయత్నంపై కేంద్ర మంత్రి కుమారస్వామి తీవ్రంగా వ్యతిరేకించారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇప్పుడు కాంగ్రెస్ పేరు మార్చితే మళ్లీ నేను అధికారంలోకి రాగానే పేరు మార్చేస్తానన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉందని రామనగరను పేరు మార్చాలని కుట్ర పన్నారన్నారు. బెంగళూరులో చేర్చితే మూటల రూపంలో నగదు దోచవచ్చుననే ఉద్దేశ్యం ఉండవచ్చునన్నారు. రామనగర జిల్లా ఎందుకు ఏర్పడిందనే ఉద్దేశ్యం అతడికి ఏం తెలుసంటూ డీసీఎం డీకే శివకుమార్‌పై మండిపడ్డారు. నేను అధికారంలో ఉన్నప్పుడు ఏర్పాటు చేశాననే అక్కసుతోనే తొలగించదలిచారన్నారు. రామనగర, చన్నపట్టణను జంటనగరాలుగా మార్చితే అభివృద్ధి సాధ్యమన్నారు. ఏకంగా పేరు మార్చితే ఏం సాధించినట్టు అన్నారు.



రాముడి పేరు ఉన్నందుకే మార్పా..? ప్రతిపక్షనేత అశోక్



రామనగర జిల్లా పేరు మార్పు వెనుక రాముడి పేరు ఉండడమే కారణమా..? అంటూ ప్రతిపక్షనేత అశోక్ మండిపడ్డారు. రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసుకునేందుకు కొత్త ఎత్తుగడ వేశారని అన్నారు. బ్రాండ్ బెంగళూరు అంటూ మోసం చేశారని ఆరోపించారు. ప్రస్తుతం బెంగళూరు దక్షిణ జిల్లా అంటూ రామనగర ప్రాంత ప్రజలకు మరో అన్యాయానికి తెర లేపారన్నారు. పేరు మార్చగానే అభివృద్ధి అసాధ్యమని అన్నారు. ఇంకెంతకాలం ప్రజలను దారితప్పేలా కుట్రలు పన్నుతారన్నారు. 2007లో అప్పటి బీజేపీ - జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వంలో రామనగర జిల్లా ఏర్పాటయిందన్నారు. ఇటీవలి ఎన్నికల్లో డీకే శివకుమార్ తమ్ముడి ఓటమిని జీర్ణించుకోలేక బీజేపీ - జేడీఎస్ మైత్రికి వ్యతిరేకంగా ద్వేషపూరితంగా పేరు మారుస్తున్నారని అన్నారు. రామనగరలో రాముడి పేరు ఉండరాదని రాహుల్‌గాంధీ సూచించారా..? అంటూ సీఎం సిద్దరామయ్యను ప్రశ్నించారు. రామనగరలో రియల్‌ఎస్టేట్ దందాకోసమే కుట్రలు పన్నుతున్నారని అన్నారు.

రామనగర మాకు గర్వకారణం: నిఖిల్‌కుమార్

రామనగర జిల్లా పేరుమార్పు ప్రస్తావనకు జేడీఎస్ పార్టీ యువ విభాగం అధ్యక్షుడు నిఖిల్‌కుమార్ మండిపడ్డారు. పురాణ ప్రసిద్ధ రామనగర పేరును బెంగళూరు దక్షిణగా పేరు మార్పు వెనుక ఏ రహస్యం ఉందో తెలియదన్నారు. ఎవరి మెప్పుకోసం ఈ కుతంత్రాలు అని ప్రశ్నించారు. రామనగరలో రియల్ ఎస్టేట్ దందా కోసం కుట్ర పన్నారని ఆరోపించారు. ఇక్కడి నుంచే కెంగల్ హనుమంతయ్య ముఖ్యమంత్రి అయ్యారని, దేవెగౌడ ప్రధాని అయ్యారని, కుమారస్వామి రెండుసార్లు ముఖ్యమంత్రిగా వ్యవహరించి రామనగర జిల్లా ప్రతిష్ఠను పెంచారని పేర్కొన్నారు.





విధానసౌధలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఎంబీ పాటిల్

రెండో విమానాశ్రయానికి స్థల పరిశీలన

150 కి.మీ. దూరంగా ఏర్పాటు చేస్తాం

భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ వెల్లడి

బెంగళూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు అభివృద్ధికి అనుగుణంగా రెండో విమానాశ్రయం అవసరమని ఆరు ప్రాంతాల్లో భూములు పరిశీలిస్తున్నామని భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ తెలిపారు. బుధవారం విధానసౌధలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కెంపేగౌడ విమానాశ్రయానికి ఏటా ప్రయాణికులతోపాటు సరుకు రవాణా గణనీయంగా పెరుగుతోందన్నారు. ప్రస్తుతం 5.2 మిలియన్ల మంది ఏడాదికి ఎయిర్‌పోర్ట్‌ను వినియోగించుకుంటున్నారని, గరిష్ఠంగా 10 మిలియన్ల మంది ప్రయాణానికి అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం 0.71 మిలియన్ల సరుకు రవాణా జరుగుతోందని గరిష్ఠంగా 1.10 మిలియన్ల సరుకుకు అవకాశం ఉందన్నారు. అంతకుమించి ప్రయాణం, సరుకు రవాణా సాధ్యం కాదని తెలిపారు. విమానాశ్రయానికి ప్రస్తుతం ఉన్న ఒప్పందం 2033 నాటికి ముగుస్తుందన్నారు. ఒప్పందం ప్రకారం 150 కిలో మీటర్లకు దూరంగా విమానాశ్రయం ఏర్పాటు చేస్తామని అన్నారు. వంద మిలియన్ ప్రయాణికుల సామర్థ్యంతో ఎయిర్‌పోర్ట్ నిర్మిస్తామని తెలిపారు. సాంకేతిక సుస్థిరత నిర్ణయించేలా నిపుణుల సలహాలు తీసుకుంటామని అన్నారు. మెట్రో, రోడ్డు, రైలు వంటి మార్గాలు ఎయిర్‌పోర్ట్‌కు అవసరం అవుతాయన్నారు. 4,500 నుంచి 5వేల ఎకరాల భూమి అవసరం ఉంటుందని వివరించారు. మాగడి, డాబస్‌పేట, జిగణి, కనకపుర, రామనగర ప్రాంతాల్లో అవకాశాలు ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు ఎక్కడా భూమి ఖరారు చేయలేదని పేర్కొన్నారు. కనకపుర, రామనగర పరిధిలో భూములు ఉన్నట్టు ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రస్తావించారని గుర్తు చేశారు. నిపుణుల సూచన మేరకే నిర్ణయం తీసుకుంటామన్నారు. తాము రెండో విమానాశ్రయ నిర్ణయాన్ని ప్రకటించిన తర్వాత తమిళనాడు ప్రభుత్వం హోసూరులో ఎయిర్‌పోర్ట్ ప్రారంభిస్తామని వెల్లడించిందని అన్నారు. ఆ ప్రభుత్వ నిర్ణయానికి అభ్యంతరం చెప్పలేమన్నారు. కేంద్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి కుమారస్వామితో రెండుసార్లు ఫోన్‌లో చర్చలు జరిపానని తెలిపారు. రాష్ట్రం నుంచి ఏ పరిశ్రమ బయటకు వెళ్లదనే విశ్వాసం వ్యక్తం చేశారు. ఇటీవల జపాన్, కొరియా దేశాలలో పర్యటించామని, రాష్ట్రానికి రూ. 6,450 కోట్ల రూపాయల పెట్టుబడులు రానున్నాయని, తద్వారా వెయ్యి ఉద్యోగాలు సాధ్యం కానున్నాయన్నారు. హైలెవెల్ కమిటీ రెండు వారాలపాటు పర్యటించి ప్రముఖ పారిశ్రామికవేత్తలతో చర్చలు జరిపామని వివరించారు. రెండు దేశాల్లో 35కుపైగా ఎంఎన్‌సీ కంపెనీలతో చర్చలు ఫలప్రదమయ్యాయని అన్నారు. ఇన్వెస్ట్ కర్ణాటక 2025లో భాగస్వామ్యం కావాలని 200 కంపెనీలను ఆహ్వానించామని తెలిపారు. ఒసాకా గ్యాస్ కంపెనీ రానున్న ఐదేళ్లలో గ్యాస్ కంపెనీ మౌలిక సదుపాయాల విస్తరణకు రూ.5వేల కోట్లు, కొరియాకు చెందిన బీఎన్ సొల్యూషన్స్ పారిశ్రామిక యంత్రోపకరణాల పరిశ్రమకు వెయ్యి కోట్ల పెట్టుబడులు పెట్టనుందని అన్నారు. జపాన్‌కు చెందిన ఆవోయమ సైసకుశో కంపెనీ తుమకూరు వద్ద జపాన్ పారిశ్రామిక టౌన్‌షిప్‌లో రూ. 210 కోట్లతో పరిశ్రమ ఏర్పాటు చేయనుందన్నారు. వాహనాల తయారీ, ఎలక్ట్రానిక్స్, పవర్ సొల్యూషన్స్ సెక్టార్లలో రూ. 25వేల కోట్లతో రాష్ట్ర కమిటీ ప్రణాళికలు సిద్ధం చేస్తోందని తెలిపారు.

ఆ మూడింటిపైనే గురి..!

- చెన్నపట్టణ, శిగ్గావి, సండూరు స్థానాలకు త్వరలో ఉప ఎన్నికలు
- సవాలుగా మారిన అభ్యర్థుల ఎంపిక
- విజయానికి మూడు పార్టీల కసరత్తు
- ప్రతిష్టాత్మకంగా మారిన చెన్నపట్టణ డీకే, కుమార వ్యూహాలు





బెంగళూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేళ జరిగిన అనూహ్య మలుపులతో ముగ్గురు ఎమ్మెల్యేలు ఎంపీలు అయ్యారు. దీంతో శాసనసభ స్థానాలకు రాజీనామాలు చేశారు. ఇలా ఎమ్మెల్యేలు రాజీనామాలు చేసి దాదాపు నెలరోజులు అవుతోంది. రాష్ట్రంలోని మూడు స్థానాలతోపాటు దేశ వ్యాప్తంగా ఖాళీగా ఉండే ఎమ్మెల్యే స్థానాలకు కేంద్ర ఎన్నికల కమిషన్ నుంచి ఎప్పుడైనా నోటిఫికేషన్ వెలువడవచ్చునని తెలుస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ, జేడీఎస్ పార్టీలకు సంబంధించి ఒక్కొక్కరు రాజీనామా చేశారు. ఉప ఎన్నికలు జరిగితే ఎవరికి కలిసొస్తుంది లేదా అదే పార్టీకి చెందినవారు శాసనసభ్యులవుతారా..? అనేది కీలకమవుతోంది. రామనగర జిల్లా చెన్నపట్టణ నుంచి హెచ్‌డీ కుమారస్వామి, హావేరి జిల్లా శిగ్గావి నుంచి మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై, బళ్లారి జిల్లా సండూరు నుంచి తుకారాం ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేశారు. మూడు నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపిక పెద్ద సవాల్‌గా మారుతోంది. చెన్నపట్టణ స్థానంపై డీసీఎం డీకే శివకుమార్, కేంద్రమంత్రి కుమారస్వామి పట్టుదలతో ఉన్నారు. చెన్నపట్టణ స్థానం కోసం డీకే శివకుమార్ భారీ వ్యూహాలు పన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఒకే రోజు నియోజకవర్గంలో 14 ఆలయాల సందర్శన, మూడు గ్రామ పంచాయతీలలో ప్రజాస్పందన సభలు నిర్వహించారు. ఇలా పదిరోజుల వ్యవధిలో నాలుగు రోజులు చెన్నపట్టణలో మకాం వేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కోట్ల రూపాయలు ప్రకటించారు. తానే బరిలోకి దిగుతానంటూ డీకే శివకుమార్ చేసిన వ్యాఖ్యలు సంచలనం కావడంతో రెండు రోజుల తర్వాత మాటమార్చారు. తొలుత ఇటీవలి ఎన్నికల్లో ఓటమి చెందిన తమ్ముడు డీకే సురేశ్‌ను అభ్యర్థి చేయాలని భావించారు. నెలరోజుల కిందటే ప్రజలు తిరస్కరించడంతో ఓటమి చెందానని, మరోసారి ఎన్నికలంటే బావుండదని, కొన్నిరోజులు విశ్రాంతి తీసుకుంటానని సురేశ్ ప్రకటించారు. డీకే శివకుమార్ కుమార్తె ఐశ్వర్య అభ్యర్థి అవుతారని ప్రచారం సాగింది. కానీ డీకే శివకుమార్ ఇకపై తమ కుటుంబంలో ఎవరూ రాజకీయాల్లోకి రారంటూ స్పష్టం చేశారు. ఈ స్థానానికి ఆర్ఆర్ నగర్‌లో ఓటమి చెందిన కుసుమ హనుమంతరాయప్పను అభ్యర్థి చేస్తారనే ప్రచారం సాగుతోంది. మరోవైపు జేడీఎస్ నుంచి కూడా ఇదే తరహాలో ఎత్తుగడలు సాగాయి. తొలుత కేంద్రమంత్రి కుమారస్వామి స్థానం నుంచి వారసుడు నిఖిల్ పోటీ చేస్తారనే ప్రచారం జరిగింది. అందుకు నిఖిల్ వెనుకడుగు వేశారు. తాజాగా బెంగళూరు గ్రామీణ ఎంపీ డాక్టర్ మంజునాథ్ భార్య, కుమారస్వామి చెల్లెలు అనసూయ అభ్యర్థి అవుతారనే ప్రచారం సాగింది. డాక్టర్ మంజునాథ్ స్పందిస్తూ అనసూయ పోటీ చేయరని తేల్చి చెప్పారు. బీజేపీ నుంచి మాజీ మంత్రి సీపీ యోగేశ్వర్ అభ్యర్థి అవుతారనే ప్రచారం ఉన్నా మలుపులు తప్పవనిపిస్తోంది. హావేరి జిల్లా శిగ్గావి నుంచి బొమ్మై కుమారుడు భరత్ అభ్యర్థి అవుతారనే ప్రచారం సాగినా స్పష్టత లేదు. కాంగ్రెస్‌లో పోటీ చేసేందుకు తీవ్రమైన లాబీయింగ్ సాగుతోంది. మంత్రులు సతీశ్ జార్కిహొళి, ఈశ్వర్‌ఖండ్రె ఇప్పటికే తొలి విడత సభ నిర్వహించారు. గడిచిన ఎన్నికల్లో ఓటమి చెందిన అజ్జంపీర్‌ఖాద్రి, యాసిర్ పఠాన్ తీవ్ర ప్రయత్నాలు సాగిస్తుండగా ఇక్కడ పంచమసాలి లింగాయతలు అత్యధికంగా ఉన్నందున సోమణ్ణ బేవినమరద, లేదా మాజీ మంత్రి వినయ్‌కులకర్ణి కుమార్తె శివలీలను అభ్యర్థి చేసే అంశం కూడా చర్చలో ఉంది. బళ్లారి జిల్లా సండూరు నుంచి మాజీ మంత్రి నాగేంద్ర సోదరుడు వెంకటేశ్ ప్రసాద్, లేదా ఎంపీ తుకారాం కుటుంబీకులలో ఒకరు అభ్యర్థి అయ్యే అవకాశం ఉంది. బీజేపీ-జేడీఎస్ కూటమి నుంచి మాజీ మంత్రి శ్రీరాములు పేరు చర్చకు వచ్చినా ఆయన వెనుకడుగు వేశారు. దీంతో అభ్యర్థి ఎవరవుతారనే ఉత్కంఠ నెలకొంది.

బదిలీల్లో దందాలు మామూలే

- ముఖ్యమంత్రి ఆర్థిక సలహాదారుడు బసవరాజరాయరెడ్డి

బెంగళూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ఉద్యోగుల బదిలీల దందా ప్రతి ప్రభుత్వంలోనూ కొనసాగిందని, ప్రస్తుత ప్రభుత్వంలోనూ అదే జరిగిందని ముఖ్యమంత్రి ఆర్థిక సలహాదారుడు బసవరాజరాయరెడ్డి తెలిపారు. కొప్పళ జిల్లా కుకనూరు తాలూకా కొమ్మనాపురలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారులు బదిలీల కోసం ఎమ్మెల్యేలు, మంత్రుల వద్దకు వెళ్తారని, ఇది ఏ పార్టీ ప్రభుత్వం ఉన్నా జరిగేదే అన్నారు. జిల్లా అధికారి, ఎస్పీతోపాటు జిల్లాలో ఉన్నత హోదాలలో ఉండే అధికారుల బదిలీలు ఇలాగే జరుగుతాయన్నారు. గత ప్రభుత్వంలోనూ ఇదే సమస్య ఉండేదన్నారు. సీఎం సిద్దరామయ్య బదిలీల దందాను నియంత్రిస్తానని ప్రకటించారని తెలిపారు. కొప్పళ ఎస్పీ యశోద వంటగోడిని లోకాయుక్త ఎస్పీగా బదిలీ చేయగా రద్దు చేయాలని స్థానిక ఎమ్మెల్యే రాఘవేంద్ర హిట్నాళ్ కోరిక మేరకు సీఎంను కోరానని అన్నారు. ఎస్పీగా ఎవరు వచ్చినా తనకెటువంటి సమస్య లేదన్నారు.



తిరుచ్చి రైల్వేస్టేషన్‌లో భారీగా నగలు, నగదు స్వాధీనం

- చెన్నై-మంగళూరు ఎక్స్‌ప్రెస్‌లో పట్టుకున్న రైల్వే పోలీసులు
- పుదుకోట యువకుడి అరెస్టు

చెన్నై, జూలై 10 (ఆంధ్రజ్యోతి): చెన్నై - మంగళూరు ఎక్స్‌ప్రెస్‌లో ఎలాంటి రశీదులు లేకుండా తరలించిన రూ.2 కోట్ల విలువైన నగలు, నగదును రైల్వే భద్రతా విభాగం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన గురించి తెలుసుకున్న ఐటీ అధికారులు విచారణ జరుపుతున్నారు. తిరుచ్చి రైల్వే జోన్ భద్రతాదళ అధికారి అభిషేక్, ఇన్‌స్పెక్టర్ జెబాస్టియన్ తదితరులు తిరుచ్చి జంక్షన్ రైల్వేస్టేషన్‌లో బుధవారం ఉదయం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. వేకువజామున చెన్నై నుంచి మంగళూరు వెళ్లే ఎక్స్‌ప్రెస్ తిరుచ్చి రైల్వే స్టేషన్‌లో ఆగింది. ఆ సమయంలో రైలు నుంచి దిగిన ఓ ప్రయాణికుడు చేతిలో బరువైన పెద్ద బ్యాగ్‌ను రైల్వేపోలీసులు గమనించారు. పోలీసులు ఆ వ్యక్తిని ఆపి, అతడి బ్యాగ్ తెరచి చూడగా దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆ బ్యాగ్‌లో రూ.500ల కరెన్సీనోట్ల కట్టలు, బంగారు బిస్కెట్లు, నగలు కనిపించాయి. వాటికి సంబంధించి ఆ వ్యక్తి వద్ద ఎలాంటి రశీదులు లేకపోవడంతో రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ వ్యక్తిని స్టేషన్‌కు తీసుకెళ్ళి విచారణ జరిపారు. ఆ నగలు, నగదు తరలిస్తున్న వ్యక్తి పుదుకోటకు చెందిన లక్ష్మణన్ అని, వాటిని అతడు మదురై తరలిస్తుండగా మార్గమధ్యంలో రైల్వే పోలీసులకు చిక్కాడు. రైల్వే భద్రతా దళం అధికారులు నగలు, నగదు పట్టుబడిన విషయాన్ని ఆదాయపు పన్నుల శాఖ అధికారులకు తెలిపారు. ఐటీ అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకుని నగలు, నగదు స్వాధీనం చేసుకుని వాటి విలువను అంచనా వేసేందుకు చర్యలు చేపట్టారు. ఐటీ సిబ్బంది లెక్కించగా రూ.15లక్షల నగదు, రూ.1.89కోట్ల విలువైన 2.45 కిలోల బంగారు కడ్డీలు, నగలు ఉన్నట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న నగదు, నగల విలువ రూ.2.04 కోట్లని ఐటీ అధికారులు ప్రకటించారు. ఆ నగలు, నగదును మదురైలో ఎవరికి అందజేసేందుకు తీసుకెళుతున్నాడనే వివరాలను లక్ష్మణన్ నుంచి రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.



నగలు, నగదుతో పట్టుబడిన యువకుడు లక్ష్మణన్‌తో పోలీసులు



మంత్రికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే తదితరులు

మా ఎమ్మెల్యేలను కొనలేరు

బీజేపీకి ఆ దమ్ములేదు

పంచాయతీరాజ్ శాఖ మంత్రి ప్రియాంక ఖర్గే

పావగడ, జూలై 10 : ప్రజల ఆశీస్సులతో రాష్ట్రంలో విజయం సాధించిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసే దమ్ము, ధైర్యం బీజేపీకిగాని, ఏ నాయకుడికిగాని లేవని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖమంత్రి ప్రియాంక ఖర్గే తెలిపారు. బుధవారం పావగడ తాలూకాలోని కారనాగనహట్టి, కెంచమరనహళ్లి గ్రామాల్లో తుంగభద్ర తాగునీటి తరలింపుపై పర్యవేక్షణ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. గురువారం నుంచి పావగడకు తుంగభద్ర నీరు వస్తుందని, రెండు నెలల్లో ప్రతి ఇంటికి జల జీవన్ మిషన్‌ద్వారా తాగునీరు అందించడానికి అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. 2013లో రూ.2,350కోట్ల నిధులతో 250 కిలో మీటర్ల విజయనగరం నుంచి తుంగభద్ర తాగునీటిని తరలించేందుకు కృషిచేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు మనమంతా రుణపడి ఉంటామని ఆయన తెలిపారు. ఈ నీటి తరలింపునకు చళికెర ఎమ్మెల్యే రఘుమూర్తి, పావగడ ఎమ్మెల్యే వెంకటేశ్ కూడా ఎంతో కృషిచేశారని వివరించారు. ఆంధ్ర సరిహద్దులోని రాజవంతి గ్రామంలో మంత్రి ప్రియాంకఖర్గేకు ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు నాని తదితరులు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1602.67	1,578.79
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	27,544	9892
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	199	255
సామర్థ్యం (టీఎంసీలు)	25.17	3.91

బస్టాండ్‌కు రాని బస్సులు



బస్సులు రాక వెలవెల పోతున్న బస్సుస్టేషన్

బళ్లారి సిటీ,జూలై 10:సండూరు తాలూకాలోని బంద్రి గ్రామంలో బస్‌స్టేషన్ నిర్మించి ఎన్నో ఏళ్ళు కావస్తున్నా ఈ మార్గంలో స్టేషన్‌కు వెళ్లకుండా ప్రధాన రహదారిపై నుంచే బస్సులు వచ్చివెళుతుంటాయి. ఈవిషయమై గ్రామస్థులు పలుమార్లు రవాణాశాఖ అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో డ్రైవర్లు ప్రజలకు వాదోపవాదాలు జరుగుతున్నాయి. చివరగా, గ్రామస్థులు స్టేషన్‌లోకి బస్సులు వెళ్ళేలా వాచ్‌మెన్‌ను నియమించారు. ఆ శాఖ అధికారులు తక్షణమే డ్రైవర్లు, కండక్టర్లను అప్రమత్తం చేసి బస్టాండ్‌లోకి తప్పనిసరిగా బస్సులు ప్రవేశించేలా ఆదేశాలు ఇవ్వాలని లేని పక్షంలో రానున్నరోజుల్లో పోరాటానికి సిద్ధమంటున్నారు.

వర్షం కోసం రైతుల అన్నదానం



అన్నదానం చేస్తున్న రైతులు

సిరుగుప్ప, జూలై 10 : సిరుగుప్ప పట్టణం ఆదోని మార్గంలో వెలసిన శ్రీ తాయమ్మదేవి ఆలయ ప్రాంగణంలో రైతులు బుధవారం అన్నదానం చేశారు. పుష్కలంగా వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలు పండాలని భాగవడే కాలువ చివరి ఆయకట్టు రైతులు ఈ కార్యక్రమం చేపట్టారు. ముందుగా దేవికి పుష్పాలంకార సేవలు, పూజలు జరిపారు. ప్రతి యేడాది జూలై మాసంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయకట్టు రైతులు తెలిపారు.

వందరోజుల పని కల్పించాలి



నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

బళ్లారి సిటీ, జూలై 10: బళ్లారి తాలూకా డి. కగ్గల్లు కూలీ కార్మికులకు ఒక కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలని ఏఐకేకేఎంఎస్(అఖిల భారత రైతు కృషికార్మిక సంఘం) డిమాండ్ చేసింది. ఆ సంఘం ఆధ్వర్యంలో బుధవారం చానాల్ గ్రామపంచాయితీ ముందు నిరసన తెలిపి పీ.డీ.ఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు గోవింద్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కరువు కాటకాలతో రైతులు నానా అవస్థలు పడుతున్నారని, 15నెలల్లో 1182 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఉపాధిపథకంలో పనులు ఇవ్వడం లేదన్నారు. ఉన్నతాధికారులు తక్షణమే దీనిపై దృష్టిసారించి రైతులకు పని కల్పించాలని లేనిపక్షంలో పంచాయితీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి గురల్లి రాజా, సభ్యుడు కే.శివరాజు, రైతులు రామప్ప, సోమప్ప, గంగాధర,నాగరాజు, దొడ్డాపెద్దయ్య, గాదిలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

సిరుగుప్ప, జూలై 10 : కార్మికులకు జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా సీఐటీయు ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ జరిగింది. సిరుగుప్ప పట్టణంలో సీఐటీయు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, హమాలీ కార్మికులు తమకు జరుగుతున్న అన్యాయాన్ని వ్యతిరేకిస్తూ హైస్కూలు మైదానం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు సురేష్‌పాల్గొన్నారు.

పాపం పండింది

- మాజీ మంత్రి.. ఎమ్మెల్యే ఇళ్లలో ఈడీ సోదాలు
- వందలాది ఎకరాలకు సంబంధించిన పత్రాల స్వాధీనం




రాయచూరు రూరల్ ఎమ్మెల్యే ఇంట్లో సోదాలు జరుపుతున్న ఈడీ అధికారులు

బళ్లారి, రాయచూరు జూలై 10(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ఎస్టీ కార్పొరేషన్‌లో రూ.187 కోట్ల నిధుల దుర్వినియోగం కేసు దర్యాప్తులో భాగంగా.. మాజీ మంత్రి, బళ్లారి గ్రామీణ ఎమ్మెల్యే బి.నాగేంద్ర, రాయచూరు రూరల్ ఎమ్మెల్యే దద్దన బసన్నగౌడ ఇళ్లలో ఈడీ అధికారులు బుధవారం సోదాలు చేశారు. మాజీ మంత్రి బి.నాగేంద్ర అధికారిక పీఏ చేతన్, మీడియా కో-ఆర్డినేటర్ నాగరాజు, వ్యక్తి గత కార్యదర్శి విజయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. నలుగురితో కూడిన ఈడీ అధికారుల బృందం బుధవారం ఉదయం బళ్లారి నెహ్రూకాలనీలో ఉన్న మాజీ మంత్రి బి.నాగేంద్ర ఇంటికి చేరుకుని సోదాలు నిర్వహించింది. అనంతరం ఆయన పీఏ చేతన్‌ను పిలిపించి వివరాలు సేకరించింది. వ్యక్తిగత కార్యదర్శి విజయ్‌కుమార్‌ను తమ వద్దకు రావాలని సూచించింది. తాను బెంగళూరులో ఉన్నానని ఆయన చెప్పడంతో.. సాయంత్రానికి బళ్లారికి రావాలని, లేదంటే బెంగళూరులో ఉండే ఈడీ కార్యాలయానికి వెళ్లి అధికారుల ఎదుట హాజరు కావాలని సూచించారు. మాజీ మంత్రి మీడియా కో-ఆర్డినేటర్ నాగరాజు ఇంట్లోనూ సోదాలుచేశారు. అనంతరం నాగరాజును మాజీ మంత్రి ఇంటివద్దకు తీసుకొచ్చి విచారించారు. నిధుల దుర్వినియోగం విషయంలో 20 మందికి పైగా భాగస్వామ్యం ఉందని ఈడీ పేర్కొంది.

ఈ అవినీతి వ్యవహారానికి సంబంధించి ప్రత్యేక తనిఖీ బృందం మండలి అధ్యక్షుడిగా ఉన్న రాయచూరు రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ ఇంటిలో కూడా బుధవారం సోదాలు చేపట్టింది. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు అనుమానిస్తున్న ఈడీ అధికారులు ఆయన భార్య పేరున, కుమారుడి పేరున, బంధువుల పేరున ఉన్న ఆస్తుల వివరాలను సైతం సేకరిస్తున్నట్లు తెలిసింది. ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి నాగేంద్రతో పాటు వాల్మీకి అభివృద్ధి మండలి అధ్యక్షుడిగా ఉన్న రాయచూరు రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడను బెంగళూరులో విచారించిన అధికారులు క్షేత్రస్థాయిలో వారి ఆస్తులపై నిఘా ఉంచారు. ఆయన రాయచూరు తాలూకా సాథ్‌మైల్ క్రాస్ వద్ద దాదాపు 100ఎకరాలకు పైగా పొలాలు కొనుగోలు చేసినట్లు అధికారులు గుర్తించారు. దీంతో పాటు ఇటీవలే రెండు అత్యంత విలాసవంతమైన కార్లను కొనుగోలు చేశారని తనిఖీలో అధికారులు గుర్తించినట్లు తెలిసింది. వాల్మీకి కార్పొరేషన్‌లో పనిచేసే అధికారులు ఇటీవలే తాము సంబంధిత మంత్రికి, అధ్యక్షుడికి రూ.50 లక్షలకు పైగా నగదు అందజేసినట్లు ఇచ్చిన సమాచారం ఆధారంగానే ఈ దాడులు జరుపుతున్నట్లు తెలిసింది. కాగా రూరల్ ఎమ్మెల్యే ఇంటిపై ఈడీ సోదాలు మరో రెండు రోజుల పాటు కొనసాగనున్నట్లు అధికారుల సమాచారం.

వర్షాభావంతో ఎండుతున్న పంటలు

బళ్లారి సిటీ, జూలై 10: జిల్లాలో వర్షాభావ పరిస్థితుల కారణంగా తాలూకా మెట్ట ప్రాంతంలో పత్తి, కొర్రలు, సజ్జ, కంది పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. ప్రతి రోజు దట్టమైన మేఘాలు కమ్ముకున్నప్పటికీ గాలి వీచడంతో మేఘం ముందుకు కదిలిపోతోంది. దీంతో వర్షం కోసం ఎదురు



వర్షాలులేక ఎండుతున్న పంట

చూస్తున్న రైతులకు నిరాశే మిగులుతోంది. తుంగభద్ర రిజర్వాయర్‌లో నీటి ప్రవాహం తక్కువగా ఉండడంతో సాగునీరు అందక వరి, మిర్చి, పత్తి, మొక్కజొన్న సాగు చేసిన రైతులు ఆందోళనకు గురవుతున్నారు. తాలూకాలో 3500 హెక్టార్లు వర్షాధారం కింద సాగవుతుంది. ఇప్పటి వరకు 11.3సెంమీ మాత్రమే వర్షం కురిసింది. భూమిలో తేమ తగ్గుతోంది. గతేడాది వర్షాలు పూర్తిగా కురువక పోవడంతో నష్టం వాటిల్లింది. ఈ ఏడాది కూడా అదే పరిస్థితులు పునరావృతమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. కొట్టూరు తాలూకా అంతటా ఈసారి ముందస్తు వానలు కురవడంతో రైతులు ఉత్సాహంగా భూమిని దున్ని విత్తనాలు వేశారు. అయితే గత రెండు వారాలుగా వర్షాలు కురువని నేపథ్యంలో పైర్లు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ఈతాలూకాలో మొత్తం 38,523హెక్టార్లలో వర్షాధార సాగు భూమి ఉంది. చాలా వరకు వర్షాధార భూమిలో పంటలు వేసినట్లు వ్యవసాయ శాఖ తెలిపింది. సహాయ వ్యవసాయ అధికారి శ్యామ్ సుందర్ మాట్లాడుతూ, పంటలు వేసిన రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఎరువుల దుకాణాల్లో అవసరాన్ని బట్టి విత్తన నిల్వలు ఉన్నాయని, వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యాపారం మందగించిందని తెలిపారు. తాలూకా అంతట పొడి వాతావరణం కొనసాగుతోందని, వర్షసూచన మాత్రం కనిపించడంలేదంటున్నారు. మొదట్లో మంచి వర్షాలు కురిసి విత్తనాలు నాటామని, అప్పటి నుంచి వర్షాలు కురువకపోవడంతో పైరు ఎండిపోతోందని హన్సికట్టె గ్రామ రైతు బసవరాజప్ప ఆందోళన వ్యక్తపరిచారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన అవసరం

- మేయర్ ముల్లంగి నందీశ్ సూచన

బళ్లారి సిటీ,జూలై 10: జిల్లాలో డెంగ్యూ జ్వరాలు, దోమల బెడద ఎక్కువైందని బళ్లారి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ముల్లంగి నందీశ్ అన్నారు. పౌరుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ ఇళ్లలోపల బయట పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని ఆయన అధికారులకు సూచించారు. కార్పొరేషన్ హాల్లో వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. నగరంలో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో లార్వా సర్వే నిర్వహిస్తున్నామని, బృందం ఇంటింటికీ వెళ్ళినప్పుడు ప్రజలు సహకరించాలన్నారు.

డెంగ్యూ జ్వరాన్ని వ్యాప్తి చేసే ఏడీస్ జాతి దోమల లార్వా నీటిలో ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే సమాచారం అందించి నీటిని శుభ్రం చేయాలని తెలిపారు. దుకాణాల అవరణలు టైర్లు, వాటర్ ట్యాంకుల్లో నీరు నిలిచి ఉంటే వెంటనే నీటిని తొలగించి దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇవి పగటి పూట కుట్టే దోమలు కాబట్టి వీలైనంత వరకు ఇంటి లోపల దోమలను అరికట్టగల అగరబత్తీలు వాడాలని సూచించారు. మీకు జ్వరం, చాతి నొప్పి, అలసట లేదా మరేదైనా లక్షణాలు ఉంటే వెంటనే సమీపంలోని ఆసుపత్రికి వెళ్ళి వైద్యుడిని సంప్రదించాలన్నారు. డెంగ్యూపై భయపడవద్దని అప్రమత్తంగా ఉండాలని ముందస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు.

- ప్లాస్టిక్ వాడకంపై నిషేధం

నగరంలో దుకాణ యజమానులు, వీధివ్యాపారులు తమ దుకాణాల ముందు తప్పనిసరిగా కనీసం 50లీటర్ల డస్ట్‌బిన్‌ను ఉంచాలని, దుకాణాల ముందు చెత్తను వేయకూడదన్నారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను వాడరాదని,



మాట్లాడుతున్న మేయర్ ముల్లంగి నందీశ్

దీనిని ఉల్లంఘిస్తే రూ.500నుంచి రూ. 10వేల వరకు జరిమానా విధించాలన్నారు. జలసంరక్షణ చట్టం క్రింద క్రిమినల్ కేసు పెట్టాలన్నారు. రానున్న గౌరి గణేశ పండుగ సందర్భంగా నగరమంతటా పీఓపీ విగ్రహాల తయారీ విక్రయాలపై నిషేధం విధించారని, ఎవరైనా పీఓపీ విగ్రహాలను తయారు చేసినా, విక్రయించినా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈసందర్భంగా స్వచ్ఛ సుందర బళ్లారి కోసం ప్రతి ఒక్కరూ కార్పొరేషన్‌కు సహకరించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ సుకుమ్, కార్పొరేషన్ కమిషనర్, ఖలీల్‌సాబు, హెల్త్ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ అధికారులు, పోలీసు శాఖ అధికారులు, తాలూకా వైద్యాధికారులు, కార్పొరేషన్ , ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తోరణగల్లులో పెరుగుతున్న డెంగీ కేసులు



వైద్య పరీక్షల కోసం వచ్చిన డెంగీ బాధితులు

తోరణగల్లు, జూలై 10 : సండూరు తాలుకా తోరణగల్లు గ్రామంలో డెంగీ బాధితుల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. ఈ విషయంపై తోరణగల్లు ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ మణిశర్మను వివరణ కోరగా అన్ని విధాలా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని ప్రజలలో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. క్రమంగా వ్యాధి బాధితులు తగ్గుతున్నారని వివరించా రు. ప్రస్తుతం వారి నుంచి శాంపిల్స్ తీసుకుని ఇక్కడే బాధితులకు చికిత్స చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా తోరణగల్లు పరిసర ప్రాంతాల్లో సాయంత్రం వేళల్లో దోమలు పెరగకుండా ఫాగింగ్ చేపడుతున్నామన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని, దోమలు వృద్ధి చెందకుండా చూడాలని, ఇళ్లల్లో నీటిని ఎక్కువ కాలం నిల్వవుంచరాదని తదితర సూచనలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

వర్షాలకు కుప్పకూలిన ఇల్లు



సుశీనగర్‌లో వర్షాలకు దెబ్బతిన్న ఇంటిలో ఒక భాగం కూలిపోయిన దృశ్యం

తోరణగల్లు, జూలై 10 : సండూరు తాలుకా సుశీనగర్ గ్రామనివాసి అయిన జాగ్యా నాయక్ భార్య కేసలిబాయ్ నివసిస్తున్న ఇంటి గోడలు గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు తడిసి మంగళవారం రాత్రి కూలిపోయాయి. కురుస్తున్న వర్షాలకు ఇంటిగోడలు కూలిపోవడంతో తమ కుటుంబం రోడ్డున పడిందని ప్రభుత్వం సహాయం అందించాలని కేసలిబాయ్ వేడుకుంటున్నారు. దీంతో అధికారులు ఆ ఇంటిని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు తెలిపారు.

కంప్లిని ఆదర్శ పట్టణంగా మారుస్తా:ఎమ్మెల్యే



నామినేటెడ్ సభ్యులకు నియామకపత్రాలు అందిస్తున్నఎమ్మెల్యే గణేష్

కంప్లి, జూలై 10 : పట్టణంలోని 23 వార్డుల్లో అభివృద్ధి పనులతోపాటు పట్టణం ఇరువైపులావుండే రామసాగర రోడ్డు, బళ్లారి రోడ్డు, కొట్టాల రోడ్డు, గంగావతి, సన్నాపురం రోడ్ల అభివృద్ధిపనులు జరుపుతామని ఎమ్మెల్యే గణేష్ అన్నారు. అలాగే కంప్లి పట్టణంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, విద్యార్థులకు వసతి, విద్యాలయం కూడా ఒకేచోట వుండేలా నూతన భవనం ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే ఏపీఎంసీ నుంచి కొట్టాలరోడ్డు వరకు, సాయిబాబా గుడి నుంచి కొట్టాలకు వెళ్లే ఆరు కిలోమీటర్ల రోడ్డుకు త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు. కంప్లిలో ఐదుగురిని నామినేటెడ్ మెంబర్లుగా ఎన్నుకున్నామన్నారు. మౌనేష్, కోటేశ్వర్, విరుపాక్షి, క్రిష్ణ, గోపాల్‌లను నామినేట్ మెంబర్లుగా ఎన్నుకున్నామని తెలిపారు. కంప్లి పురసభ కార్యాలయంలో వారికి అభినందించి అర్హత పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు.

సిరుగుప్పకు ఉత్తమ సేవలు అందిస్తా: ఎంపీ



ఎంపీ రాజశేఖర్ ఇత్నాల్‌ను సన్మానిస్తున్న కార్యకర్తలు

సిరుగుప్ప, జూలై10 : తనను 22 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించిన సిరుగుప్ప ప్రజలకు ఉత్తమసేవలు అందిస్తానని కొప్పాళ లోక్‌సభ సభ్యులు రాజశేఖర్ ఇత్నాల్ అన్నారు. సిరుగుప్ప పట్టణంలో బుధవారం కమ్మవారి కళ్యాణమండపంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నూతన లోక్‌సభ సభ్యుడు రాజశేఖర్ ఇత్నాల్‌కు అభినందన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమాన్ని లోక్‌సభ సభ్యులు రాజశేఖర్ ఇత్నాల్ జ్యోతి వెలిగించి ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరుగుప్ప నియోజకవర్గంలో బైపాస్ రోడ్డు పనులు చేస్తానని చెప్పారు. పెండింగ్‌లో వున్న రహదారి పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నడివి నుంచి సింగపూర్ గ్రామంవరకు తుంగభద్రనదికి వంతెన నిర్మిస్తానని ఆయన తెలిపారు. సిరుగుప్ప ఎమ్మెల్యే బీఎం నాగరాజు మాట్లాడుతూ సిరుగుప్ప నియోజకవర్గం కాంగ్రెస్‌కు కంచుకోట అన్నారు. అనంతరం కార్యకర్తలు ఎంపీని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖరయ్య, మాజీ ఎంపీ కరడి సంగణ్ణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బసవన్న గౌడ, మల్లికార్జునయ్య, గోపాల్ రెడ్డి, రఘు, దేశవనూరు నాగరాజు, గణేష పాల్గొన్నారు.

నీరు మరిగించి తాగాలి: డీహెచ్ఓ



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీహెచ్ఓ రమేశ్‌బాబు, వైద్యసిబ్బంది

బళ్లారి సిటీ, జూలై 10: వాంతులు, విరేచనాల నివారణకు ప్రజలు కాచి వడపోసిన నీటిని తాగాలని డీహెచ్ఓ రమేశ్‌బాబు తెలిపారు. సండూరు తాలూకాలోని నాగేనహళ్ళి గ్రామంలో వాంతులు వచ్చినట్లు అనుమానిస్తున్న నేపథ్యంలో ఆయన ముందుజాగ్రత్తగా మంగళవారం గ్రామాన్ని సందర్శించి ప్రజలతో మాట్లాడారు. కలుషిత ఆహారం తీసుకోవడం వల్ల టైఫాయిడ్, కలరా తదితర అంటువ్యాధులు వ్యాపించే అవకాశాలు ఉన్నాయని, నీటిని నేరుగా తాగేందుకు వినియోగించుకుండా కాచి వడపోసిన నీటిని తాగాలన్నారు. ఓఆర్ఎస్ తయారు చేసే సమయంలో ఆ శాఖ అందించే ప్యాకెట్‌లోని పౌడర్‌ను పూర్తిగా లీటరు నీటిలో కలిపి ఆ మిశ్రామాన్ని వాంతుల బాధితులకు 24గంటల్లో పూర్తిగా తాగించాలని వివరించారు. గ్రామంలో కలుషిత ఆహారం తీసుకోవడం వల్లే వాంతులు వచ్చి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తూ ఇంటింటికీ వెళ్ళి నీటిని మరిగించి వడపోసి పరిశుభ్రమైన తాగాలంటూ అవగాహన కల్పిస్తున్నారు. ఈసందర్భంగా జిల్లా సర్వేయర్ డా.మరియంబి,తాలూకా పంచాయితీ పరిపాలనాధికారి షడక్షరయ్య , డాక్టర్ భరత్, జిల్లా ఆరోగ్య విద్యాశాఖాధికారి ఈశ్వర్ దాసప్పనవర్, గ్రామపంచాయితీ అభివృద్ధి అధికారి కుమారస్వామి. యత్రిస్వామి, భువనేశ్వరి, మేఘనారాణి, అంజినప్పవీరేశ్, ఇతర ఆశావర్కర్లు పాల్గొన్నారు.

హోసూరు జోన్

సోలార్ ల్యాంప్‌ల విరాళం



సోలార్ ల్యాంప్‌లు, బోధన, అభ్యాస పరికరాలను విరాళంగా ఇస్తున్న దృశ్యం

హోసూరు(కృష్ణగిరి) జూలై 10 : హోసూరు పంచాయతీ యూనియన్‌ల పరిధిలోని కొత్త కొండపల్లి, పూనపల్లి గ్రామాలకు 343 సోలార్ ల్యాంప్‌లు, బోధన, అభ్యాస పరికరాలను క్యాటర్‌పిల్లర్ మేనేజింగ్ డైరెక్టర్ రమేశ్ ముత్తురాజన్, యునైటెడ్ వే ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీరాం అనంత విరాళంగా అందజేశారు. జిల్లా కలెక్టర్ కె.ఎం.సరయుకు బుధవారం వీటిని అందించారు. క్యాటర్‌పిల్లర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సహాయంతో యునైటెడ్ వే బెంగళూనే తమ ప్రయత్నాలను గురించి చెబుతూ, తమ బృందం 50 కి.మీ దూరం కఠినమైన భూభాగాల్లో లైట్లను అమర్చిందన్నారు. ఏనుగులు, పాములు, కీటకాల నుంచి రోజువారీ బెదిరింపులను ఎదుర్కొనేందుకు వీధి దీపాలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే, భద్రత జీవనోపాధిని మెరుగుపరచడానికి , మహిళలు , పిల్లలకు మెరుగైన రక్షణ కోసం వివిధ పనులు చేశామన్నారు. కృష్ణగిరి జిల్లాలోని కొత్తగొండపల్లి , పూనపల్లి, గ్రామంలో 2000 మందికి లబ్ధి చేకూరేలా 343 సోలార్ ల్యాంప్‌లను ఏర్పాటు చేశామన్నారు. అలాగే 3000 మంది పిల్లలకు బోధన , అభ్యాస నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి 112 పిల్లల కేంద్రాలకు బోధన అభ్యాస పరికరాలు అందించా మన్నారు. హోసూరు చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సమీకృత శిశు అభివృద్ధి కార్యక్రమ అధికారిణి జయంతి, రాఘవేంద్రరెడ్డి, శక్తివేల్, మురుగన్, ఉమాశంకర్, శాఖాధికారులు పాల్గొన్నారు.

వైభవంగా సోమేశ్వర ఆలయ వార్షికోత్సవం

హోసూరు జూలై 10 : హోసూరు రాంనగర్‌లో చాలా పురాతనమైన స్వర్ణాంబికా సమేత సోమేశ్వర ఆలయంలో బుధవారం 9 వ వార్షికోత్సవం , లక్షార్చన కార్యక్రమం జరిగింది. ఉదయం గణపతి పూజ, గణపతి హోమం, లక్ష్మీ హోమం , నవగ్రహ హోమం, రుద్రపారాయణం, దీపారాధన నిర్వహించారు. అనంతరం కలశాభిషేకం ఉదయం 10 గంటలకు ప్రారంభమై రాత్రి 7 గంటల వరకు కొనసాగింది. హోసూరు ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

ప్లాస్టిక్ కవర్ల స్వాధీనం.. దుకాణదారులకు జరిమానా

హోసూరు జూలై 10 : హోసూరు నగరంలో మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించి 118 సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు, టీ కప్పులు, ప్లేట్లు స్వాధీనం చేసుకున్నారు. వారికి జరిమానా విధించారు. హోసూరు కమీషనర్ స్నేహా ఆదేశాల మేరకు మున్సిపల్ వెల్ఫేర్ అధికారి డాక్టర్ ప్రభాకరన్ ఆధ్వర్యంల్లో శానిటేషన్ అధికారులు, సూపర్ వైజర్లు, ఉద్యోగులు, బృందం షాపులను తనిఖీ చేశారు. తమిళనాడు ప్రభుత్వం నిషేధించిన 118 కిలోల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు,టీ కప్పులు, స్వాధీనం చేసుకున్నారు. షాపుల యజమానులకు రూ. లక్ష 18 వేల జరిమానా విధించారు. భవిష్యత్తులో తమిళనాడు ప్రభుత్వం నిషేధించిన ఉత్పత్తులను విక్రయించరాదని, అతిక్రమిస్తే దుకాణాలకు ఇచ్చే వ్యాపార లైసెన్స్‌ను రద్దు చేస్తామని తెలిపారు.



ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుంటున్న ఉద్యోగులు

పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తికి చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి జార్జి

రాయచూరు, జూలై 10: రాష్ట్ర అవసరాలకు తగినంత విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి కేజే జార్జి తెలిపారు. బుధవారం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి నగరంలో తనను కలిసిన విలేఖరులతో మాట్లాడారు. విద్యుత్ శాఖలో ఉన్న ఖాళీగా ఉన్న 2000 లైన్‌మెన్ పోస్టులను త్వరలోనే భర్తీ చేయనున్నట్లు ఇందుకు సంబంధించి 15 రోజుల్లోనే ఉత్తర్వులు ఇస్తామని మంత్రి వెల్లడించారు. వేసవిలో ఆర్టీపీఎస్, బళ్లారి థర్మల్ విద్యుత్ కేంద్రాల నుంచి తగినంత విద్యుత్ ఉత్పత్తి జరగకపోవడంవలన విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయాన్ని కలిగించినట్లు మంత్రి తెలిపారు. కొరత తీవ్రత ఉన్నప్పటికి రాష్ట్రంలో ఐదు గంటల పాటు నిరంతర విద్యుత్ అందించామని ప్రస్తుతం రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ కొరత లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. పంజాబ్, హర్యానా రాష్ట్రాల నుంచి తీసుకున్న విద్యుత్‌ను తిరిగి ఇవ్వనున్నట్లు మంత్రి తెలిపారు. 10 లక్షల కిమీటర్ల మేర రాష్ట్రంలో విద్యుత్ లైన్‌లు ఉన్న నేపథ్యంలో పలు సందర్భాల్లో సరఫరాకు ఆటంకం జరుగుతున్నట్లు అయినా ఎప్పటికప్పుడు మరమ్మత్తుల ద్వార సమస్యను పరిష్కరిస్తున్నట్లు మంత్రి వివరించారు.

పని చేతకాకపోతే ఇంటికి వెళ్లండి: మంత్రి కేజే జార్జి

రాయచూరు, జూలై 10 : ప్రజల సమస్యలు పరిష్కరించలేని వారు, పని చేతగాని వారు ఇంటికి వెళ్లొచ్చని రాష్ట్ర ఇంధన శాఖమంత్రి కేజే జార్జి స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలపై అధికారులు సక్రమంగా స్పందించడంలేదంటూ వస్తున్న ఫిర్యాదుల మేరకు మంత్రి పై విధంగా స్పందించారు. అధికారులు తీరు మార్చుకోవాలని లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి బుధవారం విద్యుత్ శాఖకు సంబంధించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి లింగసుగూరు తాలూకాలోని పలు తాండాలు, పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు సంబంధించి ఇప్పటికి ట్రాన్స్‌ఫార్మర్లు అందివ్వలేదని వస్తున్న ఫిర్యాదు పై స్పందించి ఐదు రోజుల్లోగా అక్కడ విద్యుత్ సరఫరా జరగాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల సమస్య ఉన్న చోట వెంటనే వాటి మరమ్మత్తులు జరిపి పరిష్కరించాలన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు రోబోలు

బెంగళూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఐటి నగరి బెంగళూరులో అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే నియంత్రించే చర్యలకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన రోబోలను ఉపయోగించేందుకు కసరత్తు సాగుతోంది. రాష్ట్ర అగ్నిమాపకశాఖ రోబోల ప్రయోజనం పొందదలిచింది. తొలివిడతలో అగ్ని ఆర్పేలాంటి రోబోలను తీసుకురాదలిచారు. నగరంలో అగ్నిప్రమాదాలు జరిగితే వెంటనే అగ్నిమాపకశాఖ ఫైరింజన్‌ల ద్వారా ఇరుకు, ట్రాఫిక్ రోడ్లలో సకాలంలో గమ్యస్థానాలను చేరడం, గోడౌన్‌లు, బేస్‌మెంట్ వంటి ప్రదేశాలతోపాటు బహుళ అంతస్తుల భవనాలలో మంటలు ఆర్పే ప్రక్రియకు కష్టతరం కానుంది. ఇటువంటి సందర్భాలలో రోబోలను ఉపయోగించదలిచారు. సిబ్బంది వెళ్లడం సాధ్యంకాని ప్రదేశాలకు రిమోట్ కంట్రోల్ ఉపయోగించి మంటలు ఆర్పవచ్చునని అగ్నిమాపకశాఖ భావిస్తోంది. రాష్ట్రంలో ఇదే తొలిసారిగా కోటి రూపాయల వ్యయంతో పది రోబోట్‌లను కొనుగోలు చేసేందుకు అగ్నిమాపకశాఖ సిద్ధమైంది. ఇప్పటికే ఢిల్లీ, ముంబై, హరియానాలతోపాటు పలు రాష్ట్రాలలో అగ్నిమాపకశాఖ రోబోట్‌లను వినియోగిస్తున్నాయి.

రోబోల ద్వారా అగ్నినిరోధక విధానం, వాటర్‌జెట్‌లు, చెయిన్ వ్యవస్థ, ఎలక్ట్రానిక్ సర్వలెన్స్ కెమెరాల ద్వారా నిఘా పెట్టనుంది. సంఘటనా స్థలానికి సంబంధించిన ఫోటోలను కంట్రోల్ యూనిట్‌కు పంపనుంది. వేగంగా కార్యాచరణలోకి దిగడం ద్వారా ప్రాణనష్టం తగ్గించడం, అగ్నిమాపక సిబ్బంది విధి నిర్వహణకు మరింత సహకారం అందించనున్నాయి. ఈ రోబోట్‌లు వంద అడుగుల దూరం నుంచే నీటిని చిమ్మే సామర్థ్యం కలిగి ఉంటాయి. జెట్ ద్వారా కేవలం నీరు మాత్రమే కాకుండా వివిధ ద్రావకాలను పిచికారీ చేయనుంది.



రోబో మోడల్

ప్రతిభా పురస్కారాల ప్రదానం


పురస్కారాలతో విద్యార్థులు, తదితరులు

విజయపుర, జూలై 10: పట్టణంలోని చారిత్రాత్మక నేపథ్యం కల్గిన నగరేశ్వరస్వామి ప్రార్థనామందిరంలో నగర్త మహంతి మఠం ధర్మసంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. సంస్థగౌరవ కార్యదర్శి వి విశ్వనాథ్ మాట్లాడుతూ 2023-24 విద్యాసంవత్సరంలో ఎక్కువమార్కులు పొందిన 15మందికి ప్రతిభా పురస్కారాలు, 38మందికి సహాయధనం అందచేసినట్టు తెలిపారు. దాతలు ఎం కౌశల్య నాగరాజ్, తాయమ్మలలు విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఆరోగ్యం కోసం మదుపు చేయడం అభినందనీయమన్నారు. తమ సంస్థ ద్వారా అంత్యసంస్కారాలు, ధార్మిక కార్యక్రమాలు, వైద్య చికిత్సల కోసం సహాయధనం ఇస్తున్నామన్నారు. ప్రగతి గ్రూప్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ కృపాశంకర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. తమ సంస్థ తరఫున నగర్త సామాజికవర్గం పిల్లలకు సహాయహస్తం ఇవ్వాలని ఉద్దేశించినట్టు తెలిపారు. మహంతిమఠం సంస్థ అధ్యక్షుడు పునీత్ శివకుమార్ మాట్లాడుతూ నగర్త సామాజికవర్గీయులు తక్కువగా ఉన్నప్పటికీ పట్టణంలో దానధర్మాలలో పేరొందారన్నారు. ఈ సందర్భంగా దాతలను, రిటైర్డు టీచర్ గిరిజా, బంగారుపతక విజేత గానవి, షణ్ముఖ, పీహెచ్‌డీ పొందిన డాక్టర్ ఎస్ సంతోష్‌కుమార్‌లను ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రగతి పాఠశాల హెడ్మాస్టర్ వీ బసవరాజ్, ధర్మసంస్థ పదాధికారులు, బెంగళూరు ఏఎస్‌వీఎన్‌వీ సంఘం డైరెక్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఏటా లక్ష మందికి శిక్షణ

▸▸ బీఎస్‌వీటీ సీఈఓ సంతోష్‌కుమార్

బెంగళూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఏడాదికి కనీసం లక్షమందికి నైపుణ్య శిక్షణలు కల్పించి విదేశాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం లక్ష్యమని భారత్ స్కూల్ ఆఫ్ వర్టికల్ ట్రాన్స్‌పోర్టేషన్ (బీఎస్‌వీటీ) సీఈఓ సంతోష్‌కుమార్ వెల్లడించారు. దేశంలో తొలి సంస్థ బీఎస్‌వీటీ బెంగళూరులో నైపుణ్యకేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించింది. బుధవారం నగరంలో జరిగిన కార్యక్రమంలో కార్మికశాఖ మంత్రి సంతోష్‌లాడ్, బీడీఏ చైర్మన్ హారిస్, మాజీ ఐపీఎస్ అధికారి భాస్కర్‌రావు, బీఎస్‌వీటీ ఎండీ ముస్తాక్, మెహ్రాజ్‌ఖాన్‌లు పాల్గొన్నారు. శిక్షణ, నైపుణ్య ద్వారా వర్టికల్ ట్రాన్స్‌పోర్టేషన్ విభాగంలో చైతన్యం తీసుకురావాలన్నారు. విద్యార్థులకు గుణాత్మకమైన విద్య సాధ్యమైనంత ఉత్తమ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఎలివేటర్స్, ఎస్కలేటర్స్, కేబుల్‌కార్ విభాగాలలో శిక్షణలు ఇస్తామన్నారు. మంత్రి సంతోష్‌లాడ్ దేశంలో తొలిసంస్థ భవిష్యత్తులో ఎక్కువ మందికి ఉద్యోగావకాశాలు కల్పించాలనే ఆలోచన మంచిదన్నారు. రాష్ట్రంలో ఏటా పదిలక్షలమంది ఎస్ఎస్ఎల్‌సి పరీక్షలు ఉత్తీర్ణులు అవుతారని అందులో ఏడెనిమిది లక్షల మంది పీయూసీకి వెళ్తారని ఆ తర్వాత నాలుగైదు లక్షల మంది డిగ్రీ దాకా చదువుతారన్నారు. కానీ ఏటా లక్షలాది మంది ఉన్నత విద్యకు చేరుకోకుండానే డ్రాప్ అవుట్స్ లేదా ఇతరత్రా వృత్తి విద్యాకోర్సులకు వెళ్తారన్నారు. ఇలాంటి విద్యార్థులకు డిప్లమో ఇన్ వర్టికల్ ట్రాన్స్‌పోర్టేషన్ టెక్నాలజీ, అప్‌స్కిల్లింగ్ ప్రోగ్రామ్ ఇన్ వర్టికల్ ట్రాన్స్‌పోర్టేషన్ కోర్సులు ఉపయుక్తం కానున్నాయన్నారు.


మంత్రి సంతోష్‌లాడ్‌కు సన్మానం

పోరాటాలు స్వాభిమానానికి సంకేతం


చర్చాగోష్టిలో పాల్గొన్న ప్రముఖులు

దొడ్డబళ్ళాపుర, జూలై 10: పోరాటాలు ఏవైనా స్వాభిమానానికి సంకేతంగా ఉంటాయని దళిత విమోచనా సేన సంస్థాపక అధ్యక్షుడు మా మునిరాజు అభిప్రాయపడ్డారు. తాలూకాలోని రాజఘట్టలో పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటైన చర్చాగోష్టిలో ఆయన మాట్లాడుతూ పేదల ధ్వనిగా సంస్థ ఏర్పాటు చేశామన్నారు. దొడ్డబళ్ళాపుర కేంద్రంగా ఎన్నో పోరాటాలు చేశామన్నారు. 70-80 దశాబ్దాలలో సామాజిక పోరాటాలలో కొత్త అధ్యాయానికి దొడ్డబళ్ళాపుర పాత్ర అపారమన్నారు. అందులో రాజఘట్ట కూడా ఉందన్నారు. కన్నడ, దళిత, రైతు పోరాటాలలో తమ సంఘం మరింత క్రియాశీలకంగా పనిచేస్తుందన్నారు. పోరాటాలు మరింత పటిష్టంగా కొనసాగాల్సిన అవసరం ఉందని నిరుత్సాహం చెందితే ముందుకు సాగలేమన్నారు. నగరసభ మాజీ అధ్యక్షుడు ప్రభుదేవ్, కన్నడ పక్ష ప్రముఖుడు సంజీవనాయక, ప్రొఫెసర్ కేఆర్ రవికిరణ్, చలవాది మహాసభ తాలూకా అధ్యక్షుడు గురురాజప్ప, దళితనేత మునిసుబ్బయ్య, తదితరులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. దొడ్డబళ్ళాపుర యోజనా ప్రాధికార సభ్యుడు అంజనమూర్తి, కరవే తాలూకా అధ్యక్షుడు హమామ్ వెంకటేశ్, గౌరవాధ్యక్షుడు మహేశ్, కార్మిక విభాగం అధ్యక్షుడు రాజఘట్ట మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టు మార్కెట్‌ను సందర్శించిన విద్యార్థులు

శిడ్లఘట్ట, జూలై 10: ఆసియాఖండంలోనే పేరొందిన పట్టణంలోని పట్టుగూళ్ల మార్కెట్‌ను అధ్యయనంలో భాగంగా చింతామణి వ్యవసాయ, సిరికల్చర్ యూనివర్సిటీ మూడో సెమిస్టర్ విద్యార్థులు బుధవారం సందర్శించారు. మార్కెట్‌లో పట్టుగూళ్ల వేలం గురించి సమాచారం పొందారు. మార్కెట్ సహాయక డైరెక్టర్ తిమ్మరాజు మాట్లాడుతూ ఇ-వేలం ప్రక్రియ ద్వారా నాణ్యమైన పట్టుగూళ్లకు ఖచ్చితమైన ధర లభిస్తుందన్నారు. తద్వారా రైతులు, రీలర్‌లు ఇద్దరికీ లాభదాయకమన్నారు. గతంలో బహిరంగవేలం పద్ధతి ఉండేదని సుమారు ఏడెనిమిది సంవత్సరాలుగా ఇ-వేలం అమలు చేస్తున్నామన్నారు. రైతులు తెచ్చే పట్టుగూళ్లకు ఒక జాలరి కేటాయించబడుతుందని, ఇలా ప్రతి లాట్‌కు ఒక సంఖ్య ఇవ్వబడుతుందన్నారు. తమ లాట్‌కు మొబైల్ యాప్ ద్వారా నిర్దిష్ట ధర నమోదు చేయవచ్చునన్నారు. రైతులకు ఆ ధర అంగీకారమైతేనే ఇ-వేలం సాధ్యమన్నారు. లేనిపక్షంలో సదరు లాట్‌ను వెంటనే వేలం వేయరని, మరో అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పట్టుశాఖ డిప్యూటీ డైరెక్టర్ మహదేవయ్య, పల్లవి, బూదగూరు వెంకటస్వామి, రీలర్‌లు, రైతులు పాల్గొన్నారు.


ఇ-వేలం వీక్షిస్తున్న విద్యార్థులు

ఉత్తమ భవిష్యత్తును రూపొందించుకోండి


బ్యాగులతో విద్యార్థులు

బాగేపల్లి, జూలై 10: సౌలభ్యాల కొరతతో కుగ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న వారి విద్యార్థుల ప్రగతి కుంటుబడరాదని, ఉజ్వల భవిష్యత్తుకోసం ఉన్నత లక్ష్యం కోసం ముందుకు సాగాలని బిఎస్ఎన్ఎల్ రిటైర్డు ఇంజనీర్ బిఆర్ కృష్ణ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని తుంగేటిదిన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తమ కుటుంబ సభ్యులతో కలసి స్కూల్‌బ్యాగులు, అవసరమైన జామెట్రీ బాక్స్ కిట్‌ను పంపిణీ చేసి మాట్లాడారు. నేటి ఆధునిక యుగంతో గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు పేదరికం కారణంగా చదువుకు దూరం కారాదనే తమవంతు చేయూత ఇస్తున్నట్టు తెలిపారు. దాతల సహకారం ఉంటే మరింత ప్రగతి సాధ్యమన్నారు. సామాజిక బాధ్యతగా శ్రీమంతులు, తదితరులు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకోసం చేయూత ఇవ్వాలన్నారు. సీనియర్ న్యాయవాది ఎ.జి.సుధాకర్ మాట్లాడుతూ మన గ్రామం, మన పాఠశాల అనే భావనతో ప్రతి ఒక్కరూ అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో దాతలు మాలతి కృష్ణ, బీఆర్‌సీ సమన్వయ అధికారి ఆర్ వెంకటరామప్ప, హైస్కూల్ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామత్...

సీఎస్ఆర్ ఆంజనేయులు (జయంతి)



తొలితరం తెలుగు సినీ నటుడు సీఎస్ఆర్‌గా చిరపరిచితులైన చిలకలపూడి సీతారామ ఆంజనేయులు 1907 జూలై 11న కృష్ణా జిల్లా మచిలీపట్నం మండలంలోని చిలకలపూడిలో జన్మించారు. నాటకరంగంలోనూ, వెండితెరపైనా తనదైన చెరగని ముద్రవేశారు. రామదాసు, తుకారాం, సారంగధర వంటి విభిన్నపాత్రలకు నాటకరంగంలో అలవోకగా నటించి జీవం పోశారు. ఐదున్నర దశాబ్దాలలో 175కుపైగా తెలుగు సినిమాలలో నటించారు. 1937లో ఆయన నటించిన 'భక్త రామదాసు' ఎన్నో అవార్డులు పొందింది. 1950లో 'పాతాళ భైరవి' సినిమా దేశంలో ఏర్పాటైన తొలి అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో ప్రదర్శించబడింది. ప్రత్యేకించి 'శ్రీకృష్ణ' వేషధారణలో గుర్తింపు పొందారు. 'మాయా బజార్'లో శకుని పాత్రలోనూ, కన్యాశుల్కంలో రామప్పపంతులుగా, ఇల్లరికంలో మేనేజరుగా, కన్యాదానంలో పెళ్ళిళ్ల పేరయ పాత్రలకు జీవం పోశారు. అలాగే ఇతర సాంఘిక చిత్రాలలో సత్తా చాటుకున్నారు. 1963 అక్టోబరు 8న కన్నుమూశారు.

నూకల చిన్న సత్యనారాయణ (వర్ధంతి)



'పద్మభూషణ్' గ్రహీత డాక్టర్ నూకల చిన్నసత్యనారాయణ 1923 ఆగస్టు 4న విశాఖ జిల్లా అనకాపల్లిలో జన్మించారు. కర్ణాటక సంగీతానికి ఎనలేని సేవలందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి. 'మహామహోపాధ్యాయ'గా పేరొందారు. విజయనగరంలోని మహారాజ కాలేజ్ ఆఫ్ మ్యూజిక్‌లో ప్రొఫెసర్‌గా, ప్రిన్సిపాల్‌గా, తిరుపతి శ్రీ వెంకటేశ్వర సంగీత కళాశాలకు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. రేడియోలో భక్తి రంజనిలో ఆయన పాటలు ఎంతో పేరొందాయి. టీటీడీ, కంచి కామకోటి పీఠం, శృంగేరి శంకర, పుష్పగిరి పీఠాలకు 'ఆస్థాన విద్వాన్'గా వ్యవహరించారు. 2013 జూలై 11న కన్నుమూశారు.

మణిశర్మ (పుట్టినరోజు)



ప్రముఖ సంగీతదర్శకుడు మణిశర్మ 1964 జూలై 11న కృష్ణా జిల్లా మచిలీపట్నంలో జన్మించారు. స్వరకర్త, గాయకుడు, సంగీత దర్శకుడిగా పేరొందారు. తెలుగుతోపాటు తమిళ, హిందీ, కన్నడ సినిమాలలో రాణించారు. 200కుపైగా సినిమాలకు సంగీతం అందించి 'మెలోడీ బ్రహ్మ, స్వరబ్రహ్మ'గా పేరొందారు. ఆయన సంగీతం అందించిన పలు హీరోల సినిమాలు బ్లాక్‌బస్టర్‌గా నిలిచాయి. కీబోర్డు, మాండోలిన్, హార్మోనియం, గిటార్ వంటి వాటిపై పట్టు ఉంది. ఉత్తమ సంగీత దర్శకుడిగా రెండు నంది అవార్డులు, మూడు ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్‌సౌత్, సినిమా అవార్డ్స్, మిర్చి మ్యూజిక్ అవార్డులు తదితర పురస్కారాలు అందుకున్నారు.

గొల్లహళ్లి భూ వివాదానికి సర్వేతో తెర


సర్వేలో అధికారులు, పోలీసులు తదితరులు

చింతామణి, జూలై 10: తాలూకాలోని చిలకలనేర్పు హోబళి గొల్లహళ్ళి గ్రామానికి చెందిన సర్వే 171/1లో రెవెన్యూ అధికారులు, పోలీసులు వివాదాన్ని పరిష్కరించారు. సుమారు 3 ఎకరాల 2 గుంటల భూమిపైకి ఖరాబు ప్రదేశంగా గుర్తించి చిక్కబళ్ళాపుర జిల్లా డీడీఎల్ఆర్ అధికారి ఆదేశాలు జారీ చేశారు. తాలూకా దండాధికారి సుదర్శన్ యాదవ్, రెవెన్యూ అధికారులు, సర్వే అధికారులు వివాదాస్పద స్థలాన్ని సందర్శించారు. కెంచార్లహళ్ళి పోలీసులు బందోబస్తు నడుమ సర్వే చేసి వివాదాస్పద స్థలానికి బ్రేక్ పెట్టారు. గొల్లహళ్ళి గ్రామానికి చెందిన చిన్నప్పరెడ్డి, మునిశామప్పల మధ్య కొన్నేళ్లుగా వివాదం ఉండగా చిక్కబళ్ళాపుర జిల్లా ఉప విభాగం అధికారుల కోర్టుకు చేరింది. జిల్లా ఉప విభాగాధికారి సదరు భూమిని నియమానుసారంగా అవసరమైన రికార్డులను పరిశీలించి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు సూచించారు. తాలూకా దండాధికారి సుదర్శన్ యాదవ్ మాట్లాడుతూ వివాదాస్పద భూమిని సర్వే చేయడంతో ఖరాబు భూమిని గుర్తించి పరిష్కరించామన్నారు.

మీడియా అకాడమీ చైర్‌పర్సన్‌గా ఆయేషాఖానం


ఆయేషాఖానం

బెంగళూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్‌గా సీనియర్ పాత్రికేయురాలు ఆయేషా ఖానంను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సభ్యులుగా చిత్రదుర్గ జిల్లా సీనియర్ పాత్రికేయుడు ఎంఎన్ అహోబళపతి, సీనియర్ ఫోటోగ్రాఫర్ కే వెంకటేశ్, కొప్పళ జిల్లా గంగావతి తాలూకాకు చెందిన సీనియర్ పాత్రికేయుడు కే నింగజ్జను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయేషా ఖానం 26ఏళ్లుగా పాత్రికేయురాలిగా ఉన్నారు.

ఇంటీరియర్ డిజైన్‌లో డ్యూరోప్లై నాణ్యత

బెంగళూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఇంటీరియర్ డిజైన్లలో డ్యూరోప్లై సంస్థ నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తోందని దేశ వ్యాప్తంగా వినియోగదారుల నమ్మకాన్ని పొందామని సీఎండీ అఖిలేశ్ చిట్లాంగియా ప్రకటించారు. ఈమేరకు బెంగళూరులో డ్యూరోప్లై బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్లైవుడ్ తయారీలో 68ఏళ్ల అనుభవం కలిగి ఉన్నామని మూడు తరాల పరంపర ఉందన్నారు. ఇండియన్ ప్లైవుడ్ పరిశ్రమకు ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ డిజైన్లను పరిచయం చేస్తున్నామన్నారు. వినియోగదారులు, ఉద్యోగులు, డిస్ట్రిబ్యూటర్‌లు, కంట్రాక్టర్‌లు, కార్పెంటర్లతో 68 ఏళ్ల సంబరం చేసుకుంటున్నామన్నారు. దేశవ్యాప్తంగా 16శాఖల ద్వారా సేవలందిస్తున్నామన్నారు. వాస్తు శిల్పులు, ఇంటీరియర్ డిజైనర్స్, దేశవ్యాప్తంగా డీలర్‌ల సహకారంతోనే ప్రగతి సాధ్యమైందన్నారు.

నీటి కుంటలో పడి ఇద్దరి మృతి

కుందుర్పి, జూలై 10: బడికెళ్లిన బిడ్డ శవంగా వస్తాడని ఆ తల్లిదండ్రులు ఊహించలేదు. కూలి పనులకు పోయిన తమ కొడుకు ఎవరినో కాపాడబోయి మృత్యు ఒడికి చేరుతాడని మరో తల్లిదండ్రులు అనుకోలేదు. కాని ఒకే సంఘటనలో బాలుడు, యువకుడు చనిపోవడం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. తన కాలి చెప్పు నీటిలో కొట్టుకుపోతోందని విద్యార్థి కుంటలో దిగి మునిగిపోగా, ఆ బాలుడిని కాపాడబోయి మరో యువకుడు నీట మునిగి మృతి చెందాడు. ఈ సంఘటన కుందుర్పిలో బుధవారం జరిగింది. కుందుర్పికి చెందిన నాగేంద్ర, అనితలక్ష్మి రెండో కుమారుడు సజ్జల విష్ణు (11) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. ఎప్పటిలాగే పాఠశాలకు వెళ్లిన విద్యార్థి విష్ణు బుధవారం పాఠశాలలో ఇంటర్వెల్ సమయంలో పాఠశాల పక్కనే ఉన్న బద్రికుంటకు విద్యార్థులతో కలిసి బహిర్భూమికి వెళ్లాడు. తిరిగి వచ్చే సమయంలో నీటిలో తన చెప్పులను శుభ్రం చేసుకుంటుండగా ఒక చెప్పు జారిపోయింది. దానిని తీసుకునే క్రమంలో ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడిపోయాడు. ఒడ్డున ఉన్న విద్యార్థులు కేకలు వేయడంతో పక్కనే బండలు కొట్టేందుకు కూలి పనులకు వెళ్లిన కంసల నవీన్ (26) అక్కడికి వచ్చాడు. మునిగిపోతున్న విష్ణును కాపాడేందుకు తనకు ఈత రాకపోయినా, లోతు అంచనా వేయకుండానే కుంటలో దిగాడు. నీటి కుంట మధ్యలో లోతు ఎక్కువగా ఉండటంతో విద్యార్థితో పాటు అతను కూడా నీటిలో మునిగిపోయాడు. ఒడ్డున వున్న విద్యార్థులు కేకలు వేస్తూ పాఠశాల ఉపాధ్యాయులకు సమాచారం అందించారు. ఉపాధ్యాయులు, గ్రామస్థులు పెద్దఎత్తున అక్కడకు చేరుకుని కుంటలో నుంచి ఇద్దరిని బయటకు తీసుకొచ్చారు. కొన ఊపిరితో వున్న విష్ణు, నవీన్‌లను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఇద్దరూ మృతి చెందారు. దీంతో నవీన్ తల్లిదండ్రులు కంసలి రామాచారి, కంసలి లక్ష్మీదేవి, విష్ణు తల్లిదండ్రులు బోరున విలపించారు. మృతదేహాలను కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డిప్యూటీ డీఈవో శ్రీనివాసరావు హుటాహుటిన కుందుర్పికి చేరుకుని విద్యార్థి మృతి చెందిన ప్రాంతాన్ని పరిశీలించారు. దీనిపై కుందుర్పి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాఠశాలలో సౌకర్యం లేకనే బయటకు..

జడ్పీ ఉన్నత పాఠశాలలో దాదాపు 600 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే వారికి మరుగుదొడ్డి సౌకర్యం లేదు. గత మూడేళ్లుగా నాడు- నేడు పనుల కింద లక్షలు వెచ్చించినా మరుగుదొడ్డి సౌకర్యాన్ని విద్యార్థులకు కల్పించలేకపోయారు. అందుకే బహిర్భూమికి సమీప బద్రికుంటలోకి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

తాత్కాలిక డీఆర్ఎంగా విజయ కుమార్

గుంతకల్లు, జూలై 10: గుంతకల్లు రైల్వే డివిజన్‌కు తాత్కాలిక డీఆర్ఎంగా ఎం విజయకుమార్‌ను నియమిస్తూ రైల్వే బోర్డు ఉత్తర్వులను బుధవారం జారీచేసింది. గతంలో డీఆర్ఎంగా ఉన్న వినీత్ కుమార్ అవినీతి కేసులో సీబీఐకి చిక్కిన కారణంగా ఆయన స్థానంలో దక్షిణమధ్య రైల్వే జోన్‌లో ఇండియన్ రైల్వే సర్వీస్ మెకానికల్ ఇంజనీరుగా (నాన్ ఫంక్షనల్ హయ్యర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్) పనిచేస్తున్న ఎం విజయకుమార్‌కు తాత్కాలికంగా డీఆర్ఎం విధులను అప్పగించారు. రెగ్యులర్ డీఆర్ఎంగా మరొక అధికారి వచ్చేంత వరకూ ఈయన డివిజనల్ రైల్వే మేనేజరుగా కొనసాగుతారు.

బీఎస్పీ తమిళ నేత హత్యపై నిరసన

బంగారపేట, జూలై 10: తమిళనాడులోని బహుజన సమాజ్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యను తాలూకా బీఎస్పీ ఖండించింది. పట్టణంలోని తాలూకా కార్యాలయం వద్ద బుధవారం నిరసన తెలిపారు. కర్ణాటక దళిత రైతుసేన రాష్ట్ర అధ్యక్షుడు హుణసనహళ్ళి ఎన్ వెంకటేశ్ మాట్లాడుతూ తమిళనాడు బీఎస్పీ అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య ఘటన దేశం తలదించుకునే విషయమన్నారు. తమిళనాడు సుమారు 60శాతం దళితులు ఉన్నారన్నారు. స్థానిక పార్టీల ప్రాబల్యం అధికమన్నారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో బీఎస్పీ తరపున ఎక్కువసంఖ్యలో పోటీ చేసి గెలుపు సాధించాలన్న తరుణంలో కొంతమంది దుండగులు ఆర్మ్‌స్ట్రాంగ్‌ను హతమార్చారన్నారు. దళితుల ఉన్నతిని ఓర్వలేక ఇంకా దురాగతాలు సాగుతుండడం విచారకరమన్నారు. ఇంతలా జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర హోం ఇంటెలిజెన్స్‌లు కన్నుమూసుకుని ఉన్నాయంటూ ఆక్రోశం వ్యక్తం చేశారు. చిగురు సంస్థ అధ్యక్షురాలు ప్రభావతి మాట్లాడుతూ దేశంలో దళితులకు రక్షణ కరువైందన్నారు. దళితులపై రాజకీయ ద్వేషాలు మానుకుని ప్రగతికి సహకరించాలని కోరారు. తమిళనాడులో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ న్యాయవాదిగానే కాక పార్టీ బలోపేతానికి పాటుపడ్డారన్నారు. ఈమేరకు శిరస్తేదార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఎస్పీకి చెందిన రమణ్‌కుమార్, శంకర్, నక్కనహళ్ళి వెంకటేశ్, మరగల్ మునియప్ప, సూలికుంటె ప్రకాశ్, చిక్క అక్కండహళ్ళి అశ్వథ్, శాంతకుమారి, ఎంజల్, ధృతి, భవ్య తదితరులు పాల్గొన్నారు.


శిరస్తేదార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

ఇట్టసంద్ర అధ్యక్షురాలిగా చాంద్ సుల్తాన్ ఏకగ్రీవం


నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు సన్మానం

హొస్కోటె, జూలై 10: హొస్కోటె తాలూకా నందగుడి హోబళిలోని ఇట్టసంద్ర గ్రామపంచాయతీ అధ్యక్షురాలిగా చాంద్ సుల్తాన్, ఉపాధ్యక్షురాలిగా నందిని ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి గీతా ప్రకటించారు. కొంతకాలం కింద అధ్యక్ష, ఉపాధ్యక్షస్థానాలకు రాజీనామా చేయడంతో తలెత్తిన స్థానాలకు బుధవారం ఎన్నికలు నిర్వహించారు. కాంగ్రెస్ మద్దతుదారులు 17మంది సభ్యులు ఉన్నారు. అధ్యక్షస్థానానికి చాంద్ సుల్తాన్, ఉపాధ్యక్ష స్థానానికి నందిని తలా ఒక్కరు మాత్రమే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవమయ్యారు. నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను కేపీసీసీ కార్యదర్శి ఇట్టసంద్ర గోపాల్ అభినందించి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు ప్రామాణికంగా అందేలా సహకారం అందించాలన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ, రాష్ట్ర ఒక్కలిగ సంఘం డైరెక్టర్ బీవీ రాజశేఖరగౌడ అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మునిశామగౌడ, ఎస్ఎఫ్‌సిఎస్ అధ్యక్షుడు నారాయణప్ప, మాజీ అధ్యక్షుడు హెచ్‌కే నారాయణగౌడ, ఉపాధ్యక్షుడు రాళకుంటె మునిశామగౌడ, పీడీఓ పుష్పలతా, గ్రామ పంచాయతీ మాజీ అధ్యక్షురాలు బిందు దేవేగౌడ, గ్రామపంచాయతీ సభ్యులు రమేశ్, జయరాం తదితరులు పాల్గొన్నారు.